క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం అడ్డరోడ్డు సెంటర్లోని అభయాంజనేయస్వామి ఆలయ పంచమ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు డీఎస్ మూర్తి, సాయిమణిపవన్‌లు పంచామృతాలతో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. సీతారామాంజనేయ భక్తసమాజం వారిచే హనుమాన్ చాలీసా 108సార్లు పారాయణ గావించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం రెండువేల మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను కోడూరు మల్లికార్జునరావు, రామకోటేశ్వరరావు పర్యవేక్షించారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడి ఏటీపీఎం హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు రూ.5లక్షల ఉపకార వేతనాలు అందజేశారు. కార్నర్ స్టోన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకులు ఫాదర్ మన్నం సుధాకర్ ఆధ్వర్యంలో 82 మంది ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇతర వృత్తి విద్యాకోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు రూ.5లక్షల ఉపకార వేతనాలను గురువారం పంపిణీ చేశారు. ఉపకార వేతనాలు అందజేసిన ఫాదర్ మన్నం సుధాకర్‌లను పాఠశాల ఉపాధ్యాయులు, పెద్దలు సత్కరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు మురళీ, హృదయరాజు, ఉపాధ్యాయులు బాలకిషోర్, జాకోబ్, నాగరాజు, శ్రీను, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నా ఫొటోతో స్టాంప్ ఆవిష్కరణ



మంగళగిరి: పోస్టాఫీసులో నూతనంగా నా స్టాంప్‌తో ఫొటో అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. ప్రస్తుత ఆధునిక యుగంలో ఉత్తరాలు, పోస్టాఫీసులను గత జ్ఞాపికలుగా మిగిలే పరిస్థితులలో నా ఫొటోతో స్టాంప్ అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మరలా పోస్టాఫీసులు ప్రజలకు దగ్గర అయ్యే అవకాశముందన్నారు. గురువారం ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో నా ఫొటోతో స్టాంప్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోస్టుఫీసు కార్యాలయ అధికారులు బి శ్రీనివాసరావు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాసమస్యల సత్వరపరిష్కారానికి కృషి



ఫిరంగిపురం: గ్రామాల్లోని ప్రజల సమస్యల పరిష్కారానికి సత్వరమే తనవంతు కృషి చేస్తానని ఎంపీపీ షేక్.షహేలానర్గీస్ అన్నారు. మండలంలోని పొనుగుపాడు గ్రామ జిల్లా పరిషత్ రోడ్డు పూర్తిగా పాడవడంతో గ్రామస్తులు సమస్యను పరిష్కరించాలని కోరడంతో స్పందించిన ఎంపీపీ షేక్.షహేలానర్గీస్ మండల పరిషత్ నిధులు రూ.3లక్షలు కేటాయించారు. గురువారం పనులు జరుగుతున్న తీరును ఆమె పరిశీలించారు. సత్వరమే పనులు పూర్తిచేయాలని కోరారు. ఆమె మాట్లాడుతూ గుంటూరు -నరసరావుపేట ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి 2,8 కిలోమీటర్ రోడ్డు మరమ్మతులకు నిధులు కేటాయించామని చెప్పారు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తిఅయి రోడ్డు వినియోగంలోకి వస్తుందని తెలిపారు. ఆమె వెంట నాయకులు గేరా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు ఖాసింషాహిద్, లక్ష్మయ్య, జేసీఎస్ కన్వీనర్ పి.మరియబాబు, సేవానాగరాజు, చంద్రం, నాయకులు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడులు

మంగళగిరి: నగర పరిధిలోని నిడమర్రు తాడికొండ మండలం కంతేరుల మధ్య పొలాల్లో జరుగుతున్న కోడిపందేలపై పోలీసులు దాడులు నిర్వహించారు.

రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు కోడిపందేలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి 11 మంది పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.27,500 నగదు, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు

- పలు అలంకారాలలో అమ్మవారు దర్శనం
- ఆలయాలలో ప్రత్యేక పూజలు
- తరలివచ్చిన భక్తులు

మంగళగిరి: నగరంలో దసరా నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం నగరంలోని ఆలయాలలో అమ్మవారు వివిధ అలంకారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. నగరంలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీనసింహస్వామి వారి ఆలయంలో వేంచేసి ఉన్న రాజ్యలక్ష్మి అమ్మవారు శ్రీ సంతానలక్ష్మి అలంకారంలో, శివాలయంలో రాజరాజేశ్వరి దేవిగా, పాతమంగళగిరి కనకదుర్గానగర్‌లో లలితా త్రిపుర సుందరీ దేవిగా, కాళీమాత ఆలయంలో లలితా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమివ్వగా భక్తులు అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌తోపాటు, దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రులలో భాగంగా గురువారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు పలు అలంకారాలలో దర్శనమిచ్చారు.

తాడేపల్లి బొమ్మల మండపం సెంటర్‌లో....

తాడేపల్లి బొమ్మల మండపం సెంటర్‌లో వేంచేసిన ఉన్న గంగ బాలత్రిపుర సుందరీదేవి రాజరాజేశ్వరిదేవి సమేత త్రిపుర తాండవేశ్వరస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న అమ్మవారికి శ్రీ దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా గురువారం శ్రీ మహాచండీ అలంకారం చేసి భక్తులకు దర్శనమిచ్చారు.

మోరంపూడిలో....

దుగ్గిరాల మండలం మోరంపూడి గ్రామంలో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక విగ్రహాన్ని ఏర్పాటు చేసి జై గణేష్ యూత్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 5వ రోజు చండీ అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

కంతంరాజు కొండూరులో....



శివాలయంలో రాజరాజేశ్వరి దేవి అలంకారంలో అమ్మవారు

దుగ్గిరాల మండలం కంతంరాజు కొండూరులో వేంచేసిన ఉన్న మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి ఆశ్వీయుజ శుద్ధ పంచమి సందర్భంగా గౌరీదేవి అలంకారం చేసి భక్తులకు దర్శనమిచ్చారని ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకట రెడ్డి తెలిపారు.

వినుకొండ అమ్మ దేవస్థానం

పోలకంపాడులో వేంచేసి ఉన్న వినుకొండ అంకమ్మ దేవస్థానంలో అమ్మవారికి 5వ రోజు అయిన గురువారం చండికాదేవి అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉండవల్లిలో...

ఉండవల్లి సెంటర్‌లో గణేష్‌యూత్ ఉత్సవ కమిటీ



సంతానలక్ష్మి అలంకారంలో అమ్మవారు

ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి చండీదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్గించారు.

విజయకీలాద్రిపై.....

సీతానగరం విజయకీలాద్రిపై వేంచేసి ఉన్న అమ్మవారికి త్రిదంచి చిన్నజీయర్‌స్వామి, అహోబిల రామాను జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం జయలక్ష్మి అమ్మవారికి నవ కలశ స్నపనం, తిరుమంజన సేవ, అమ్మవారికి సహస్ర నామార్చన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

ధనలక్ష్మి అలంకారంలో వాసవీమాత

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అమ్మవార్లను ధనలక్ష్మి మాతగా అలంక



తాడేపల్లి బొమ్మల మండపం సెంటర్‌లోని శివాలయంలో మహాచండీ దేవి అలంకారం

రించి పూజలు చేశారు. ఉదయాన్నే అర్చకులు అమ్మవార్లకు స్నపన కార్యక్రమాలు నిర్వహించి కుంకుమార్చనలు చేశారు. ఫిరంగిపురంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అర్చకులు రాజేంద్రశర్మ అమ్మవారిని ధనలక్ష్మి మాతగా అలంకరించి విశేష కుంకుమార్చనలు చేశారు. అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరిని ధనలక్ష్మీగా అర్చకులు అయ్యన్నశాస్త్రి అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



మోరంపూడిలో చండీదేవి అలంకారంలో అమ్మవారు



విజయకీలాద్రి పర్వతంపై జయలక్ష్మి అలంకారంలో అమ్మవారు



వాసవీమాతను ధనలక్ష్మిగా అలంకరించిన అర్చకులు

అమ్మవారికి వెండి ఆభరణాలు బహూకరణ



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లిలో వేంచేసి ఉన్న కాశీ విశ్వేశ్వర ఆలయంలో అన్నపూర్ణ అమ్మవారికి దాత వెండి ఆభరణాలు గురువారం బహూకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అచ్చిరెడ్డి మాట్లాడుతూ 400 సంవత్సరాల చరిత్ర కలిగిన కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ అమ్మవారికి కుంచనపల్లికి చెందిన దాత కాజా వెంకటేశ్వరరావు, రమాదేవి దంపతులు అన్నపూర్ణ అమ్మవారికి వెండి కిరీటం, రెండు కర్ణభేరీలు, చటారి, వెండి పళ్లెం అందజేశారని తెలిపారు. వెండి ఆభరణాలు అందజేయడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని కాజా వెంకటేశ్వరరావు హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం దాత కాజా వెంకటేశ్వరరావు, రమాదేవి దంపతులను సత్కరించారు. కాట్రగడ్డ ఆంజనేయులు, కాట్రగడ్డ పూర్ణయ్య, కాజా పెద్ద వెంకటేశ్వరరావు, కాజా కాశీరాంబాబు, చాగంటి సాంబిరెడ్డి పాల్గొన్నారు.

నకిలీ పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

మంగళగిరి: నకిలీ పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి దుకాణాలను సీజ్ చేస్తామని వ్యవసాయ శాఖ మంగళగిరి ఏడీఏ జి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. గురువారం మంగళగిరి సబ్ డివిజన్ పరిధిలోని తాడేపల్లి, మంగళగిరి, తాడికొండ, తుళ్లూరు మండలాల్లోని పురుగు మందులు, ఎరువుల దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

ఏడీఏ మాట్లాడుతూ పలు దుకాణాలలో తనిఖీలు నిర్వహించి నాణ్యతపై అనుమానం ఉన్న మందుల శాంపిల్స్‌ను సేకరించి పరీక్ష కేంద్రాలకు పంపడం జరిగిందన్నారు. సబ్ డివిజన్ పరిధిలో 13 రకాల పురుగుమందుల శాంపిల్స్‌ను సేకరించి పరీక్ష కేంద్రాలకు పంపామన్నారు.

వైద్యరంగంలో సరికొత్త ఒరవడి జగనన్న ఆరోగ్య సురక్ష

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య రంగంలో సరికొత్త ఒరవడి అని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా దుగ్గిరాల ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యాన దుగ్గిరాల మండలం కంతంరాజు కొండూరులో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వేలాదిమంది పేద ప్రజలు తమ ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ఎంతోమంది విద్యార్థులకు కంటి సంబంధిత పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేశ్వరి, ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, వైఎస్సార్ సీపీ మండల అధ్య



కంతంరాజు కొండూరు గ్రామంలో కళ్లజోళ్లు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు

క్షులు శృంగరపాటి రత్నం, కంతంరాజు కొండూరు సర్పంచ్ ఉన్నం ఝాన్సీరాణి, వైఎస్సార్ సీపీ జిల్లా సభ్యులు వడ్డేశ్వరం రజనీకాంత్, బీసీ విభాగం అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్) ప్రభుత్వ వైద్యులు ప్రభాకర్ శివ, ఇందిర, కె.తాజుద్దీన్, సుకన్య, వివి కర్ణ, ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో....

తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం ప్రభుత్వ వైద్యశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జేసీఎస్ మండల కన్వీనర్ ఈదులమూడి డేవిడ్ రాజు ముందుగా దివంగతనేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, డాక్టర్ కిరణ్‌కుమార్‌లతో కలసి ఉచితంగా కళ్లజోళ్లు, పౌష్టికాహార కిట్లను అందజేశారు. ప్రభుత్వ వైద్యులు నరేంద్రకుమార్, అజ్మా, టి.మౌనిక సాయి, డాక్టర్ బుజిత, ఎస్సీ, ఎస్టీ, బీసీ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, బాలసాని ఉన్నారు.

అందరికి ఆరోగ్యం అందించడమే సురక్ష లక్ష్యం

తాడికొండ: అందరికీ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్రంలో వాడవాడలా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా తుళ్లూరు మండలం మందడం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. రోగులను పలకరించి వైద్య సేవలు అందుతున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు కేవలం తమ పార్టీలకు చెందిన నాయకులకే సంక్షేమం, అభివృద్ధిని అందించేవని, కానీ నేడు అందుకు భిన్నంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కులం, మతం, ప్రాంతం, పార్టీలకతీతంగా ప్రతి వ్యక్తికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. విద్య, వైద్యం ప్రతి పేదవాడి చెంతకు చేరాలనే లక్ష్యంతో వైద్య రంగంలో సంపూర్ణ మార్పులు తీసుకొచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొప్పుల శేషగిరిరావు ఉన్నారు.



మందడంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న కత్తెర సురేష్‌కుమార్

ఎస్‌ఐ తీరును నిరసిస్తూ ఆందోళన

తాడికొండ: హోమ్‌గార్డు ఇంటికి అడ్డొచ్చిందంటూ ఎస్‌ఐ వచ్చి దగ్గరుండి వైర్లు తొలగించాడు. ఎస్‌ఐ తీరును నిరసిస్తూ తాడికొండ జెండా చెట్టు వద్ద ప్రధాన రహదారిపై బాధితులు బైఠాయించారు. స్థానిక జెండాచెట్టు బజారులో నివాసం ఉంటున్న మహిళా హోమ్‌గార్డు ఇంటి వద్ద ఎదురు సందులో నుంచి పలువురు వినియోగదారులు విద్యుత్ తీగెలు పోల్‌కు వేసుకున్నారు. అయితే తమ ఇంటికి ఆనుకొని వెళుతున్నాయంటూ ఆమె ఫిర్యాదుతో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ నాగార్జున ప్రైవేటు విద్యుత్ సిబ్బందితో సర్వీస్‌లను తొలగించి తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న ఇనుప పోల్‌ను పడేశారు. ఆగ్రహించిన బాధితులు తాము గత 40 సంవత్సరాలుగా విద్యుత్‌ను వినియోగిస్తున్నా ఎలాంటి ఇబ్బంది లేదని, హోమ్‌గార్డు ఇల్లు నిర్మాణం చేసినప్పటి నుంచే సమస్య వచ్చిందని కావాలనే తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ సముదాయించేందుకు ప్రయత్నించగా ససేమిరా అన్నారు. ఏకపక్షంగా నిర్ణయం తీసుకొని మా సర్వీస్‌లను



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేస్తున్న బాధితులు

ఎలా తొలగిస్తారు, హోమ్‌గార్డు ఇంటి నిర్మాణం చేసిన స్థలం సంబంధించిన డాక్యుమెంట్లు తీసుకొచ్చి పరిశీలిస్తే నిజాలు బయటకు వస్తాయన్నారు. హైకోర్టు జడ్జిలు రోడ్డు మార్గంలో వచ్చే సమయం కనుక ఆందోళన విరమించాలని నచ్చజెప్పి స్టేషన్ వద్దకు తీసుకెళ్లారు. ఇరువర్గాలను సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం ఎలా తీసుకుంటారని నిలదీయడంతో తప్పని సరి పరిస్థితుల్లో విద్యుత్ అధికారులను సంప్రదించి తిరిగి విద్యుత్ కనెక్షన్‌లు ఇప్పించారు.

మంగళగిరి: ద్విచక్రవాహనంపై వెళుతుండగా చేతిలో ఉన్న సెల్ ఫోన్ లాక్కుని దుండగులు పరారయ్యారు.

సహకార సంఘం పరపతి పెంపునకు కృషి

- ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు
- రూ 2.05కోట్ల రుణాలు పంపిణీ

మంగళగిరి: రైతులు సహకార సంఘ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను వినియోగించుకుని వ్యవసాయాన్ని మరింత పెంచుకుని సహకార సంఘాల పరపతి పెంపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. నగరంలోని బ్యాంక్ కాలనీలో ఉన్న సహకార సంఘం కార్యాలయంలో మంగళగిరి మండలంలోని 24 మంది రైతులకు రూ.2.05 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ సహకార సంఘం తొలివిడత రూ. 2కోట్ల రుణాలు మంజూరు చేయగా రెండో విడత రూ.2.05 కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. రుణాలను వినియోగించుకుని రైతులు మరింత మెరుగ్గా వ్యవసాయం చేయాలన్నారు. సంఘం చైర్మన్ ఆర్ల బ్రహ్మయ్య, సభ్యులు సుంకర సుబ్బారావు, కర్రి మరియదాసు, జీడీసీసీ బ్యాంక్ మేనేజర్ చిన ఖాసిం, సొసైటీ కార్యదర్శి రాయల్ రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు ఆకురాతి రాజేష్, మునగాల మల్లేశ్వరరావు, ఎండీ ఫిరోజ్ పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించాలి

ఆహ్వాన పత్రికలు, కరపత్రాల ముద్రణలో ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే ఆర్కే అధికారులకు సూచించారు. జీడీసీసీ బ్యాంకు జగనన్న సహకార విద్యాజ్యోతి పథకం కరపత్రాలను ముద్రించి ఎమ్మెల్యే ఆర్కే ఆవిష్కరించాలని బ్యాంక్ మేనేజర్ చిన ఖాసిం కోరారు. కరపత్రాలలో ఎమ్మెల్సీ మురుగుడు పేరు లేకపోవడంతో ఎమ్మెల్యే ఆర్కే బ్యాంకు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రింట్ చేసిన కరపత్రాలను తొలగించి వాటి స్థానంలో ప్రొటోకాల్ ప్రకారం కరపత్రాలను ముద్రించి పంపిణీ చేయాలని అధికారులను కోరారు.



రైతులకు రుణాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు

మౌలిక వసతుల కల్పనకు కృషి

ప్రభుత్వ ఆసుపత్రిలో పెద్ద ఎత్తున మౌలిక వసతులు కల్పించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) స్పష్టం చేశారు. నగరంలోని ప్రభుత్వాసుపత్రిలో జరుగుతున్న పనులను గురువారం ఎమ్మెల్యే ఆర్కే ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి పరిశీలించారు. ఆసుపత్రి మార్చురీలో ఏసీ, ఫ్రీజర్ బాక్స్ లేక పోవడంతో ఆసుపత్రిలో ఎక్సరే మిషన్ పాడైందని, వసతులు సరిగా లేవని, భవనం శిథిలావస్థకు చేరిందని డాక్టర్ గీతా మాధవి ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువచ్చారు. తన సొంతనిధులు రూ.75 వేలతో ఫ్రీజర్ బాక్స్ ఏర్పాటు చేయించిన ఎమ్మెల్యే ఆర్కే కార్పొరేషన్ నిధులతో ఏసీ, అంతర్గత రోడ్లు, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన భవనం స్థానంలో రూ.21 కోట్లతో నూతన భవన నిర్మాణానికి పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వంతో ఆమోదింపచేసి ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలందించేలా చర్యలు తీసుకుని నగరాన్ని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు.

ఏకో పార్కులో మరిన్ని వసతులు

ఏకో పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచి నగర ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే ఆర్కే అన్నారు. గురువారం ఏకో పార్కును సందర్శించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే ఆర్కేకు వినతి పత్రం అందజేశారు. ఏకో పార్కు వాకింగ్ కోసం వచ్చే వారి నుంచి అటవీశాఖ ఆధ్వర్యంలో వసూలు చేయనున్న రుసుం రద్దు చేయాలని వాకర్స్ ప్రతినిధులు కోరగా అటవీశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. డాక్టర్ గీతా మాధవి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర విభాగం చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, సాలి ప్రశాంత్, కుంచాల కృష్ణ కిషోర్, కొల్లి శేషిరెడ్డి పాల్గొన్నారు.

చర్మకారుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

తాడేపల్లిరూరల్: చర్మకారుల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. గురువారం తాడేపల్లి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వద్ద చర్మకార వృత్తి చేసుకుని జీవనం కొనసాగించే వారి కోసం చర్మకారుల భవన నిర్మాణాన్ని చేపట్టారు. ఈ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ రామప్రసన్నతో కలసి పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ చర్మకారుల భవనానికి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ చర్మకారుల భవనంగా నామకరణం చేస్తున్నామని, నవంబర్ 15 నాటికి పనులు పూర్తిచేసి నిబంధనల ప్రకారం చర్మకారులకు అందజేస్తామని, చర్మకారుల భవనం ముందే డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చర్మకారుల జిల్లా అధ్యక్షులు బుల్లా రాజారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి, జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, జిల్లా ఎస్టీసెల్ ప్రధానకార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, ఎస్టీ సెల్ తాడేపల్లి అధ్యక్షులు మేడా పండు, ఎస్టీ విభాగం అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, బీసీ విభాగం నాయకులు బత్తుల దాసు, వైఎస్సార్‌సీపీ సభ్యులు మేకావెంకట రామిరెడ్డి పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల అభివృద్ధికి కృషి

నులకపేట ఉర్దూ పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) హామీ ఇచ్చారు. గురువారం తాడేపల్లిలో పర్యటించిన ఎమ్మెల్యే ఆర్కేను నులకపేట ఉర్దూ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ జిలాని మరికొందరు కలిశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అనూహ్యంగా పెరిగిందని, గతంలో నాలుగు తరగతి గదులే ఉండేవని, విద్యార్థుల సంఖ్య పెరగడంతో తరగతి గదులు చాలక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అదనపు గదుల కోసం స్థలం కేటాయించేందుకు కలెక్టర్, విద్యాశాఖ అధికారులతో చర్చించారు.